రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్









సభలో కమలదండు కోలాహలం



షాద్‌నగర్ నుంచి మోడీ సభకు బస్సుల్లో వెళుతున్న విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు



మోడీ తల్లి పాదలను కడుగుతున్న చిత్రాన్ని సభలో ప్రదర్శిస్తున్న అభిమాని

# కమల దళం కదంతొక్కె..

## నమో నామస్మరణతో మారుమోగిన సభా ప్రాంగణం!

### ప్రధాని మోడీ గర్జనను వినడానికి భారీగా తరలివెళ్లిన బిజెపి సైన్యం

### కాషాయమయమయిన రహదారులు

### దారిపొడవునా జై హో మోడీ నినాదాలు

**దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మోడీ ప్రసంగాన్ని వినేందుకు, ఆయనకు సంఘీభావం తెలిపేందుకు కాషాయ దళం భారీ ఎత్తున కదిలివచ్చింది. వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాల్లో సభా స్థలికి చేరుకున్నారు. మోడీ రాకతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.**



శామీర్‌పేట నుంచి తరలివెళుతున్న బిజెపి నాయకులు, కార్యకర్తలు

**మేడ్చల్/యాచారం/శామీర్‌పేట,/షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభకు మేడ్చల్ ఉమ్మడి మండలం నుండి బిజెపి నాయకులు తరలివెళ్లారు. మేడ్చల్ పట్టణం నుండి మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో నాయకులు పలు వాహనాలు, బస్సుల్లో తరలివెళ్లగా ఎల్లంపేట మున్సిపాలిటీ నుండి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. యాచారం మండలం నుండి అత్యధిక సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి తమ రాజకీయ ఐక్యతను, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను చాటిచెప్పారు. మండల బిజెపి అధ్యక్షులు విజయ్ నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి దాదాపు 500 మందికి పైగా కార్యకర్తలు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్థాయి బిజెపి నాయకులు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యారు. భారీ కాన్వాయ్‌లతో, బిజెపి జెండాలు, నినాదాలతో సభా ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం దేశాన్ని ప్రపంచస్థాయిలో గౌరవప్రద స్థానంలో నిలబెట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక కీలక ప్రాజెక్టులు, రహదారులు, రైల్వేలు, విద్యాసంస్థలు, సంక్షేమ పథకాలు అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ప్రస్తుతం మార్పును కోరుకుంటున్నారని, గ్రామస్థాయిలో బిజెపికి రోజురోజుకు విపరీతమైన ఆదరణ పెరుగుతోందని నాయకులు అభిప్రాయపడ్డారు. గ్రామాల నుండి యువత, మహిళలు, రైతులు, కార్మికులు స్వచ్ఛందంగా రావడం ప్రత్యేక విశేషంగా నిలిచింది.

నగరంలోని సికింద్రాబాద్ పేరెడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధాని నరేంద్రమోడీ బహిరంగసభకు శామీర్‌పేట డివిజన్, అలియాబాద్ మున్సిపాల్టీ, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ ఆయా మండలాల నుంచి బిజెపి నాయకులు, కార్యకర్తలు పలువురు వాహనాల్లో తరలివెళ్లారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్, (మండలం)లోని వివిధ గ్రామాల నుంచి, అలియాబాద్ మున్సిపాల్టీ నుంచి, మూడుచింతలపల్లి (మున్సిపాల్టీ) మండలంలోని వివిధ గ్రామాల నుంచి బిజెపి శ్రేణులు బస్సుల్లో బయలుదేరారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి తదితరులు, శామీర్‌పేట-డివిజన్ తూంకుంట నుంచి మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, పార్టీ అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డిల ఆధ్వర్యంలోను, మూడుచింతలపల్లి మండలం నుంచి బిజెపి అధ్యక్షులు టి.నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలోను పెద్ద ఎత్తున వాహనాలు తరలివెళ్లాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీ నరేంద్రమోడీ బహిరంగ సభకు ఫరూఖ్ నగర్ మండలం కార్యకర్తలతో బయలుదేరిన బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితర నాయకులు వెళ్లారు. ఫరుక్ నగర్ మండల నుంచి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కక్కునూరి వెంకటేష్ గుప్తా, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కందూరి మనోహర్ రెడ్డి, ఫరూక్ నగర్ బిజెపి మండల అధ్యక్షులు పిట్టల సురేష్ కార్యకర్తలు బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జిలతో కలిసి పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరారు.



మేడ్చల్ నుండి బయలు దేరిన బిజెపి నాయకులు



యాచారం నుంచి..

# పాపాల భైరవులు



**కందుకూరు, మే 10, ప్రభాతవార్త:** పాల స్వచ్ఛతను కాపాడాల్సింది పోయి, కేవలం లాభాపేక్షతో వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఒక పాల వ్యాపారి ఉదంతం కందుకూరులో వెలుగులోకి వచ్చింది. పాలు పాడవకుండా ఉండేందుకు ప్రమాదకరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్ కెమికల్‌ను కలుపుతున్న మరామోని శ్రీశైలం అనే వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలలోకి వెళితే.. దసర్లపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం చుట్టుపక్కల రైతుల నుంచి పాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తుంటాడు. సాధారణంగా మధ్యాహ్నం సేకరించిన పాలు రాత్రికి పాడవకుండా ఉండాలంటే ఫ్రిజ్‌లో ఉంచి భద్రపరచాలి.

**కందుకూరులో కల్తీ పాల కేంద్రం సీజ్**

**ఫ్రిజ్ వాడితే విద్యుత్ బిల్లు వస్తుందని ప్రజల ప్రాణాలతో చెలగాటం**

**పాలు విరిగిపోకుండా ప్రమాదకర రసాయనాల వినియోగం**

**పాల కేంద్రంపై పోలీసుల మెరుపు దాడి**

**భారీగా హైడ్రోజన్ పెరాక్సైడ్ స్వాధీనం**

**నిందితుడు శ్రీశైలం అరెస్ట్**

**మనం తాగే పాలు మన ప్రాణాలనే తీస్తున్నాయా? కొంతమంది కేటుగాళ్ల మాయాజాలం చూస్తుంటే అవుననే సమాధానం వస్తోంది. హైదరాబాద్ శివార్లలోని కందుకూరు మండలంలో దారుణమైన కల్తీ పాల దందా వెలుగులోకి వచ్చింది. పాలను నిల్వ ఉంచేందుకు ఫ్రిజ్‌లు వాడాల్సి ఉండగా, కరెంటు బిల్లులు మిగుల్చుకోవాలనే దురాశతో ఓ వ్యాపారి ఏకంగా హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను పాలలో కలుపుతున్నాడు. నమ్మకంతో పాలు కొనే వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ముఠా గుట్టును కందుకూరు పోలీసులు రట్టు చేశారు.**

అయితే, ఫ్రిజ్ వాడితే కరెంటు బిల్లు ఎక్కువ వస్తుందన్న దురాశతో, అతను ఒక లీటరు కెమికల్ బాటిల్‌ను తక్కువ ఖర్చుతో కొనుగోలు చేసి, ఆ ద్రావణాన్ని పాల డబ్బాల్లో కలిపేవాడు. విశ్వసనీయంగా సమాచారం అందుకున్న కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు తన బృందంతో కలిసి పాల కేంద్రంపై దాడి చేశారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపిన 3 పాల క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. కల్తీకి ఉపయోగిస్తున్న కెమికల్ ద్రావణాన్ని సీజ్ చేశారు. నిందితుడు శ్రీశైలంను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటి కెమికల్స్ కలిపిన పాలు తాగడం వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేవలం సొంత లాభం కోసం సామాన్య ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం అమానుషమని ఆయన మండిపడ్డారు. ఎవరైనా ఇలాంటి నిషేధిత పదార్థాలను కలిపి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. నిందితుడిపై కఠిన చట్టాల కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అడవి వదిలి ఊరు చేరి




**★ కూలీల వేషంలో దళ సభ్యులు!**
**★ రుక్మాపూర్ రైల్వే ట్రాక్ పనుల్లో కలకలం**
**★ ముప్పై యేళ్ల తర్వాత మావోల కదలిక**
**★ మహారాష్ట్ర ఖాకీల ఆపరేషన్ సక్సెస్**
**★ ప్రాణరక్షణ కోసం వచ్చారా? విద్రోహ చర్యలకు స్కెచ్ వేశారా?**
**★ లోతుగా విచారిస్తున్న పోలీసులు**
**★ ఉలిక్కిపడ్డ వికారాబాద్ జిల్లా**
**★ అప్రమత్తమైన జిల్లా పోలీస్ యంత్రాంగం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** సుమారు మూడు దశాబ్దాల తర్వాత మావోయిస్టుల కదలికలతో ఒక్కసారిగా జిల్లా ఉలిక్కి పడింది. వివరాలలోకి వెళితే.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుక్మాపూర్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నాయి. 10 రోజుల క్రితమే కొంతమంది కొత్త వ్యక్తులు కూలీలుగా వచ్చి చేరారు. వీరి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నా యన్న పక్కా సమాచారంతో మహారాష్ట్రలోని గచ్చిరౌలి పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శనివారం అర్ధరాత్రి తాండూరుకు చేరుకున్నారు. వీరిలో మెరికల్లాంటి 15 మంది సాయుధులు ఉన్నారు. వికారాబాద్ జిల్లా పోలీసుల సహకారంతో ఎవరికీ అనుమానం రాకుండా పౌర దుస్తుల్లో వెళ్లిన ప్రత్యేక బృందాలు రైల్వే ట్రాక్ వద్ద పనిచేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.

**ఛత్తీస్‌గఢ్ నుంచి రుక్మాపూర్‌కు..**

అరెస్టయిన వారు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గచ్చిరోలి ప్రాంతానికి చెందిన మావోయిస్టులుగా పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. ఆ ప్రాంతం లో గత కొన్ని రోజులుగా పోలీసుల నిఘా పెరగడం, వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు జరుగుతుండటంతో ప్రాణ రక్షణ కోసం వీరు బతుకుదెరువు పేరుతో ఈ ప్రాంతానికి వచ్చినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

వీరు కేవలం ప్రాణరక్షణ కోసం వచ్చారా? లేక ఇక్కడ ఏదైనా విద్రోహ చర్యలకు స్కెచ్ వేశారా? అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు అడవిని నమ్ముకున్న వీరు, ఇప్పుడు ఇలా కూలీల వేషంలో పట్టుబడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుతం నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఉన్నతాధికారులు రహస్య ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది.

**జిల్లా పోలీసుల నిఘా వైఫల్యమా?**

ఈ సంఘటనతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా కలవరానికి గురైనారు. స్థానికంగా తీవ్ర అలజడిని సృష్టించింది. ప్రత్యేకించి తెలంగాణ పోలీసులకు సవాలు విసిరినట్లయింది. కూలీలుగా చేరిన మావోయిస్టుల వద్ద ఎలాంటి ఆయుధాలు లేనందున కాల్పుల శబ్దం లేకుండా పోలీసులు పట్టుకోగలిగారు. నలుగురిలో ఓ మహిళా నక్సలైట్ కూడా ఉండటం గమనార్హం. సంఘ విద్రోహ శక్తులతో పాటు మావోయిస్టులు కూడా తాండూరు ప్రాంతాన్ని షెల్టర్‌గా వాడుకుంటున్నారని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా పోలీసు వ్యవస్థ, నిఘా విభాగం పనితీరును పరిహసింపజేసేలా ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

**గతంలోనూ నక్సల్స్ అలజడి**

1985 నుంచి 1998 వరకు వికారాబాద్ జిల్లాలో నక్సలైట్ల కార్యకలాపాలు జరిగాయి. అప్పట్లో జనశక్తి, పీపుల్స్ వార్, రెడ్ టైగర్స్ పేరిట సాయుధ నక్సలైట్లు భూస్వాములపై దాడులు జరిపారు. పెత్తందార్లకు వ్యతిరేకంగా పలు పోరాటాలు చేసినా క్రమేణా సంఘాల్లో విభేదాలు నెలకొన్నాయి. పీపుల్స్ వార్ దళంలో వరంగల్‌కు చెందిన గంగన్న వికారాబాద్, పూడూరు, పరిగి, బంట్వారం, తాండూరు, పెద్దేముల్, ధారూరు ప్రాంతాల్లో విస్తరించారు. పొరుగున ఉన్న కర్నాటకలోని చించోలి, కుంచవరం అడవుల్లో తలదాచుకున్నట్లు ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. పలువురు సర్పంచ్‌ల కిడ్నాప్, కల్లు వ్యాపారులపై దాడులు వంటి సంఘటనలు చోటు చేసుకున్నారు. 1992-93లో ధారూరు మండలం నాగారం అడవుల్లో గంగన్నను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. అప్పటి నుంచి కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. జనశక్తి ఆరంభంలో కొంత ప్రభావం చూపించింది. ర్యాడికల్స్ ప్రభావం యువతపై తీవ్రంగా చూపెట్టింది. తాండూరుకు చెందిన పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి కూడా కొంతకాలం పాటు నక్సలైట్ ఉద్యమాన్ని నడిపించారు. 1998లో రెడ్‌టైగర్స్‌కు చెందిన ఐదుగురు నక్సలైట్లను బొంరాస్‌పేట మండలం కొత్తూరు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చేయడంతో దళాలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. 2004-05లో పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి కూడా పరిటాల రవి హత్య కేసులో నిందితుడిగా చేర్చారు. కొంతకాలానికి ఆయన కూడా హత్యకు గురైనారు. అయితే, 1998 తర్వాత నక్సల్స్ ప్రభావం పూర్తిగా తగ్గడంతో ప్రజలు వాటి గురించి మరిచిపోయారు. నల్లమల, ఛత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లో తరచూ జరిగిన సంఘటనలను మీడియా ద్వారా తెలుసుకోవడం తప్ప ఈ ప్రాంతంలో వారి కదలికల గురించి వినలేదు.



రుక్మాపూర్ రైల్వేస్టేషన్‌లో మావోయిస్టులు తలదాచుకున్న క్వార్టర్లు

**పొరుగు రాష్ట్రాల కూలీలపై ఆరా**

సుమారు పదేళ్లుగా తాండూరు ప్రాంతంలో బీహార్, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన చాలామంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. నాపరాయి, సిమెంట్ కర్మాగారాలే కాకుండా హమాలీలుగా కూడా పని చేస్తున్నారు. స్థానిక కూలీలకు ఇచ్చే రేట్లు గిట్టుబాటు కాకపోవడం, వారు వేళకు సరిగ్గా పనిచేయడం లేదనే కారణం వల్ల పొరుగు రాష్ట్రాల కూలీలకు పనులు కల్పిస్తున్నారు. వరి కోత సమయంలో రైస్‌మిల్లుల వద్ద బీహార్, ఛత్తీస్‌ఘడ్ హమాలీలు ఎక్కువగా పని చేస్తుంటారు. తాజా సంఘటనతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఈ సంఘటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పొరుగు రాష్ట్రాల కూలీల గురించి ఆరా తీయనున్నారు.

# వారసత్వ సంపదపై పంజా

**కాకతీయుల చెరువు కట్టను దున్నేస్తున్న జెసిబిలు**

**ప్రజాప్రతినిధుల అండతోనే ఆక్రమణలు**

**చారిత్రక ఎర్రకుంట చెరువును మట్టిపాలు చేస్తారా?**

**సిపిఎం నేతల ఆందోళన**

**హైడ్రా అధికారులకు ఫిర్యాదు**

**యాచారం, మే 10, ప్రభాతవార్త:** కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లను భూస్వాములు మట్టిపాలజేస్తున్నారు. యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 155లో గల ఎర్రకుంట చెరువు కట్టను స్థానిక భూస్వాములు జేసీబీలతో ధ్వంసం చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ అక్రమ ఉదంతాన్ని సిపిఎం బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి. అంజయ్య మాట్లాడుతూ.. నిజాం కాలం కంటే ముందు, కాకతీయుల హయాంలోనే నిర్మితమైన ఈ కుంట ఈ ప్రాంతానికి ప్రాణాధారమని పేర్కొన్నారు. పట్టా భూమిలో ఉందనే నెపంతో, కొందరు ప్రజాప్రతినిధుల సహ కారంతో చెరువు కట్టను మొండిగా కూల్చివేశారని ఆరోపించారు. నీరు నిలిచే ప్రాంతాన్ని మట్టితో నింపి ఆక్రమించు కోవడమే కాకుండా, పొలాల నుండి చెరువులోకి వచ్చే నీటి కాలువలను సైతం మూసివేశారని మండిపడ్డారు. దీనివల్ల పశుపక్ష్యాదులకు తాగునీరు కరువై, భూగర్భ జలాలు అట్టడుగుకు వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ వైస్ ఎంపీపీ ఎం. శ్రీమన్నారాయణ, మండల కమిటీ సభ్యుడు ఎం. బాల్ రాజ్ మాట్లాడుతూ.. చారిత్రక సంపదను ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్, హైడ్రా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి, ధ్వంసమైన కట్టను పునరుద్ధరించి, పోసిన మట్టిని తొలగించాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి పి. రమేష్, ఎం. రాములు, ఎన్. సత్తయ్య, ఎం. సత్తయ్య, పి. సత్యనారాయణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తవ్వేసిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

# జనగణనపై అవగాహన వాక్




మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న అధికారులు

**వికారాబాద్, ప్రభాతవార్త :** సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సత్తార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్ నుండి ఎన్నెపల్లి చౌరస్తా వరకు మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి నారాయణ, టీఎంసీ వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు రవి చంద్ర, ఫిజికల్ డైరెక్టర్ లు, ఎన్యూమరేటరులు, సూపర్ వైజర్లు, టెక్నీకల్ అసిస్టెంట్‌లు, యువత పలు సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా: వివాహిత మృతి

**పెద్దేముల్, మే 10: ప్రభాతవార్త:** ఆటో బోల్తా పడి మహిళ మృతిచెందిన సంఘటన పెద్దెముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం చోటుచేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాలు ప్రకారం, మాన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన నందినికి, చౌడాపూర్ మండలం చిన్న మేఘ్యా నాయక్ తాండాకు చెందిన మెగావత్ సురేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం కాగా, వీరు ప్రస్తుతం హైదరాబాద్‌లోని కాళీమందిర్ ప్రాంతంలో నివసిస్తున్నారు.

ఇంట్లో జరిగే ఒక శుభకార్యం నిమిత్తం ఈ నెల 8న వీరు స్వగ్రామానికి వచ్చారు. శనివారం మధ్యాహ్నం నందిని తన భర్తతో కలిసి ఆటోలో తాండూర్‌కు షాపింగ్ కోసం బయలుదేరగా, చైతన్య నగర్ గ్రామ శివారులో భర్త సురేష్ ఆటోను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన నందినిని వెంటనే తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని ఈశా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. ఘటనపై మృతురాలి తండ్రి అంగోత్ నారాయణ ఫిర్యాదు మేరకు పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.



నందిని (ఫైల్ ఫోటో)



జ్ఞాపికాలను అందిస్తున్న దృశ్యం

## గురుశిష్య బంధానికి ప్రతీకగా కోనాపూర్ పూర్వ విద్యార్థుల వేడుక

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త :**

సదాశివపేట మండలం కోనాపూర్ గ్రామంలో 1991-1992 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆత్మీయ వాతావరణంలో అంగ రంగ వైభవంగా జరిగింది. మూడు దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న సహపాఠకులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందోత్సాహంతో మమేకమయ్యారు. ఈ అపూర్వ కలయికలో పూర్వ విద్యార్థులు ఎన్ వెంకటేశం, మఠం మల్లికార్జున్, మనోహర్, వెంకటేశం గౌడ్, సిద్దన్న, పురుషోత్తం, నాగరాజు గౌడ్, నాగన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొని తమ విద్యార్థిదశ అనుభవాలను పంచుకున్నారు. గురువుల సేవలు జీవితానికి మార్గదర్శకమని పూర్వ విద్యార్థులు కొనియాడారు.

స్నేహ బంధాలకు చిరస్మరణీయ వేదికగా నిలిచిన ఈ సమ్మేళనం కోనాపూర్ గ్రామంలో హర్షాతిరేక వాతావరణాన్ని తీసుకొచ్చింది. గురువుల పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి సర్, శంకరయ్య సార్, నర్సయ్య సార్, భాస్కర్ రావు సార్, నాగరాజు సార్, వీరేశం సార్‌లను ఘనంగా సత్కరించారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

**కొల్చారం, మే 10, ప్రభాతవార్త :**

తుక్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ దొడ్ల అంజనేయులు ఆదివారం ముగ్గు పోసి భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన సర్దన మల్లమ్మ, యాదగిరి దంపతులకు ప్రభుత్వం ఇల్లు మంజూరు కావడంతో గ్రామస్తుల సమక్షంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్ల అంజనేయులు మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేయడం ఆనందదాయకమని తెలిపారు. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కలగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబాజీ రావు, దత్తు రావు, టెక్మాల్ మల్లప్ప, టెక్మాల్ సిద్దప్ప, రామయ్య, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.



పిల్లల సమక్షంలో జన్మదిన వేడుకలు

## అనాథ పిల్లల సమక్షంలో జన్మదిన వేడుకలను జరుపుకున్న జి.టి.ఆర్.

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త :**

సదాశివపేటలోని సామాజిక సేవ, సంఘసంస్కర్త అయినటువంటి జి టి ఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మెమిన్ పేటలోని హెల్ప్ హోమ్ సొసైటీ లో అనాథ పిల్లల సమక్షంలో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జి టి ఆర్ మాట్లాడుతూ అనాథాశ్రమంలో అనాథ పిల్లల మధ్యన జన్మదిన వేడుకలను జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అనాథ పిల్లలు దేవునితో సమానమని, వారికి ఎటువంటి సహాయం కావాలన్నా నేను ముందుంటానని అన్నారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు భోజనాలు సమకూర్చి, వారితో పాటు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు వరణ్, పోలీస్ పుండరీకం, సలీం, రఫీక్, తిరుపతి, రాజశేఖర్, చంటి, బన్నీ, అరుణ్, అనిల్, ఆకాష్, మాణిక్యం, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ సభకు తరలివెళ్ళిన బిజెపి శ్రేణులు

**మర్కుక్, మే 10 (ప్రభాతవార్త):**

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్రమోడి సభకు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని బిజెపి శ్రేణులు బస్సుల్లో పెద్దఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు రమేష్‌గుప్తతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మర్కుక్ నుండి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న బిజెపి నేతలు

## హుస్నాపూర్‌లో బోరును ప్రారంభించిన సర్పంచ్

**చౌటకూరు, మే 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వల్లెరియా పంచాయితీ పరిధిలోని హుస్నాపూర్‌లో గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ చిన్నలేళ్ళపాటి అనసూయ రాజశేఖర్ ఆదివారం పరిష్కారం చూపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోరుకు పంచాయితీ నిధులతో సింగిల్ ఫేజ్ మోటారును బిగించి తాగునీటిని సరఫరా చేశారు. తాగునీటి ఎద్దడిని పరిష్కరించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింగ్ వార్డు సభ్యులు తుంగె శ్రీశైలం, కొత్తెల శ్రీకాంత్, చిట్కుల శ్రీనివాస్, నాయకులు నరోత్తంరెడ్డి, మన్నె మొగులయ్య, వడ్డె నర్సింలు, శేఖర్, డబ్బనూరి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



హుస్నాపూర్‌లో బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ చిన్నలేళ్ళపాటి అనసూయ రాజశేఖర్

# బిసిలను పట్టించుకోని మోడీ రాజీనామా చేయాలి

– హుస్నాబాద్‌లో అఖిలపక్ష నాయకుల ధర్నా...

**హుస్నాబాద్ టౌన్, మే10, ప్రభాతవార్త:**

ప్రధాని నరేంద్ర మోడీ బీసీల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ప్రధానమంత్రి మోడీ రాజీనామా చేయాలని అఖిలపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలో భారీ ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో బీసీ సమస్యలపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ బీసీ నాయకుడు వి హన్మంతరావుకు మద్దతుగా పార్టీలకతీతంగా బీసీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ధర్నా కారణంగా గంటపాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల్ కమిషన్, రోహిణి కమిషన్ నివేదికల ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలకు ఉపకోటా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన, కులగణనలో బీసీ కులాల ప్రస్తావన లేకపోవడం బీసీల పట్ల జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ రక్షణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. దేశంపై ఉన్న భారీ అప్పుల భారం మోసేది కూడా బీసీ సామాజిక వర్గాలేనని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో బీసీలు కీలక పాత్ర పోషించినప్పటికీ, రోహిణి కమిషన్ నివేదిక సంవత్సరాలుగా అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. బీసీలకు రిజర్వేషన్లు రావడంలో బీజేపీలోని బీసీ నాయకులే అడ్డంకిగా మారుతున్నారని ఆరోపిస్తూ, తెలంగాణ బీజేపీకి చెందిన బీసీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు మేకల వీరన్న యాదవ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు వడ్డేపల్లి వెంకటరమణ, వెంకన్న గౌడ్, ఎండి హసన్, భగవాన్, రాములు, కౌన్సిలర్లు గోపగోని శోభన్ గౌడ్, కేశవేణి రమేష్, పూదరి వరప్రసాద్, బొలిశెట్టి రాజు, నాయకులు చెన్నబోయిన విద్యాసాగర్, కూరగాయల సమ్మయ్య, లక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న బిసి నాయకులు



నర్సాపూర్ పరిధిలోని తండా నుండి మోడీ బహిరంగ సభకు తరలిన గిరిజన మహిళలు

**నర్సాపూర్ మే 10, ప్రభాతవార్త :**

హైదరాబాదులో ని పెరేడ్ గ్రౌండ్లో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జనాగ్రహ బహిరంగ సభకు బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్ దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌నుండి బిజెపి నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు జిల్లా నుండి సుమార్ 110 బస్సులలో, 135 ఫోర్ వీలర్ వెహికల్ లో, 500 ద్విచక్ర వాహనాల్లో కలిసి మొత్తం 6000 మందిని జిల్లా నుండి ఈ బహిరంగ సభకు తరలించినట్లు తెలిపారు. బహిరంగ సభకు తరలివస్తున్న బిజెపి నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు సమకూర్చినట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేష్, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు రాములు నాయక్, జిల్లా నాయకులు నారాయణరెడ్డి, బాదే బాలరాజ్ బోర్వెల్ రాంరెడ్డి, సంఘసాని రాజు బిజెపి నాయకులు, కార్యకర్తలు గిరిజన మహిళలు తదితరులు ఉన్నారు .

## మోడీ సభకు రామాయంపేట నుంచి భారీ తరలింపు

**రామాయంపేట, మే 10, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు హాజరయ్యేందుకు రామాయంపేట మండలం, రామాయంపేట పట్టణం, నిజాంపేట మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అక్కన్నపేట సర్పంచ్ యాదగిరి, మాజీ సర్పంచ్ సిద్ధ రాములు, రామాయంపేట కౌన్సిలర్ శంకర్ గౌడ్, దంతపల్లి సర్పంచ్ బాలరాజు, లక్ష్మాపురం సర్పంచ్ నవీన్, నందిగామ సర్పంచ్ రమేష్, రాంపూర్ సర్పంచ్ ప్రవీణ్, బ్రాజుపల్లి సర్పంచ్ శ్రీనివాస్, నిజాంపేట సర్పంచ్



నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రామాయంపేట మండలంలోని అక్కన్నపేట, ఝాన్సీ లింగాపూర్, లక్ష్మాపూర్, కాట్రియాల, దంతేపల్లి, కోనాపూర్, దామరచెరువు, డి.ధర్మారం, రాయిలాపూర్ గ్రామాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు సభకు తరలివెళ్లాయి. రాయిలాపూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శి దిలీప్, దామరచెరువు మాజీ సర్పంచ్ శంకరన్న తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రధాని మోడీ సభ విజయవంతం కావాలని ఆకాంక్షి స్తూ బీజేపీ నాయకులు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

## ఛలో పెరేడ్ గ్రౌండ్స్

**పెద్దశంకరంపేట, మే 10, ప్రభాతవార్త:** హైదరాబాదులోని పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద శంకరంపేట నుండి బిజెపి నాయకులు ఆదివారం ప్రత్యేక వాహనాలలో తరలి వెళ్లారు. మోడీ సభకు తరలి వెళ్ళిన వారిలో మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్. మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. బి జె వై ఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. నాయకులు ధ్రువ. వెంకయ్య అంజయ్య, మంగలి కృష్ణ ,సుకుమార్ శంకర్ రావులు తదితరులు ఉన్నారు.




ప్రధానమంత్రి మోడీ సభకు తరలి వెళ్తున్న బిజెపి నాయకులు

# నిమ్స్‌లో విజయవంతంగా ఆహారనాళ పునర్నిర్మాణ శస్త్రసచికిత్స

**జూబ్లీహిల్స్, మే 10, ప్రభాతవార్త:**

నిమ్స్‌లో 13 ఏళ్ల మానసిక వికలాంగ బాలుడు సోల్లు సాయిప్రణీత్‌కు అత్యంత క్లిష్టమైన ఈసోఫాగస్ (ఆహార నాళం) పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయ వంతంగా నిర్వహించారు. 2024 డిసెంబర్ 5న ప్రమాదవశాత్తు డొమెక్స్ క్లీనింగ్ పౌడర్ తీసుకోవ డంతో బాలుడికి తీవ్రమైన కరోసివ్ గాయం ఏర్ప డింది. ఈ ప్రమాదం తర్వాత బాలుడికి ఆహారం మింగడంలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తాయి. ఆహార నాళం తీవ్రమైన రీతిలో దెబ్బతిని సన్నగిల్ల డంతో పోషకాహారం అందించేందుకు కడుపులో ఫీడింగ్ ట్యూబ్ అమర్చారు. గతేడాది జూలై 31న నిమ్స్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో వైద్యులు సమగ్రంగా పరీక్షి ంచి చికిత్స ప్రారం భించారు. కరోసివ్ ఈసోఫాగస్ గాయాల చికిత్సలో అమలులో ఉన్న క్లినికల్ ప్రోటోకాల్ ప్రకారం, పున ర్నిర్మాణ శస్త్రచికిత్సకు ముందు ఒక సంవత్సరం పాటు వేచి చూడాల్సి ఉంటుంది. అందువల్ల బాలు డిని ఏడాది పాటు క్రమం తప్పకుండా అవుట్ పేషెంట్ విభాగంలో పర్యవేక్షి ంచారు. ఏప్రిల్ 17న ఆరోగ్యశ్రీ పథకం కింద, ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సహాయంతో సుమారు 5 లక్షల ఖర్చయ్యే ఈసోఫాగస్ పునర్నిర్మాణ శస్త్రచికిత్సను పూర్తి ఉచి తంగా నిర్వహించారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డా. ఎన్.బీరప్ప నేతృ త్వంలో ఈ శస్త్రచికిత్సను నిర్వహించారు. బృందం లో ప్రొఫెసర్ వేణు మాధవ్ తుమ్మ, డా. సూర్య రామచంద్రవర్మ గుంటూరి, డా. భానుతేజ్ బతాల, డా. స్వామి రాజేష్, డా. జేయన్, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగ హెచ్ఓడీ డా. సుకన్య, అనస్తీ షియా బృందం ప్రొఫెసర్ డా.నిర్మల జొన్నవితుల, ప్రొఫెసర్ డా. ఇందిర, ప్రొఫెసర్ ఆన్ కిరణ్, డా. రామకృష్ణ ఉన్నారు. ఈ శస్త్రచికిత్స అత్యంత సవాళ్లతో కూడుకున్నదిగా వైద్యులు తెలిపారు.

బాలుడి ఆహారనాళం పూర్తిగా బ్లాక్‌అవ్వడం, అలాగే మానసిక పరిస్థితి కారణంగా శస్త్రచికిత్స అనంతర నిర్వహణ క్లిష్టంగా మారిందన్నారు. అయినప్పటికీ వైద్య బృందం విజయవంతంగా చికిత్స పూర్తి చేయగా, ప్రస్తుతం బాలుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా మృదువైన ఆహారం తీసుకుంటున్నాడని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. గత 34 ఏళ్లలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం 600కు పైగా కరోసివ్ గాయాల కేసులకు చికిత్స అందిం చగా, అందులో 300 మందికి పునర్నిర్మాణ శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స అనం తరం 99.4 శాతం మంది రోగులు సాధారణ పోషకస్థితిని కొనసాగించగలిగారన్నారు.

నిమ్స్‌లోని సమగ్ర వైద్య సేవలు, నైపుణ్యానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహకి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించిన సహకారానికి డైరెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలుగు జానపద కళారూపాల్లో బుర్రకథకు ప్రత్యేక స్థానం

### హైకోర్ట్ విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు

**చిక్కడపల్లి , మే 10 (ప్రభాతవార్త) :** తెలుగు జానపద కళారూపాల్లో బుర్రకథకు ప్రత్యేక స్థానం ఉందని హై కోర్ట్ విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదిక లో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో సాలం క్రిష్ణయ్య బృందం చే పార్వతి కళ్యాణం బుర్ర కథను అద్భుతంగా నిర్వహించి అందరి నుండి ప్రశంసలు అందుకున్నారు. ముఖ్య అతిథిగా జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు హాజరై ప్రసంగించారు. ఇటువంటి కళలను కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. భక్తిరసంతో కూడిన పార్వతీ కళ్యాణ ఘట్టాన్ని కళాకారులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారని ఆయన కొనియాడారు. తెలుగు వారి విశిష్ట జానపద కళారూపమైన బుర్రకథను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో స్వరకిన్నెర చింతలపూడి త్రినాథ్ రావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత పెరుగుతున్నా.. మన మూలాలైన జానపద కళల పట్ల మమకారం తగ్గకూడదని అన్నారు. కథా గానం ద్వారా సామాజిక అంశాలను, పౌరాణిక గాథలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బుర్రకథ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. సాలం




బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న హైకోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు జనార్ధన మూర్తి

కృష్ణయ్య బృందం ప్రదర్శించిన పార్వతీ కళ్యాణం బుర్రకథ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పౌరాణిక గాథను తమదైన శైలిలో, అద్భుతమైన గానం మరియు వాచకంతో ప్రదర్శించి సభికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

### మాల జాతి మనుగడకు పివిరావును ఆదర్శంగా తీసుకోవాలి

**సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త:** దేశంలో దళితుల ఐక్యత కోసం, షెడ్యూల్ కులాల విచ్ఛిన్నంకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేసి మాలల ఆత్మగౌరవ గళాన్ని వినిపించింది పి.వి.రావు మాత్రమేనని సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ స్పష్టం చేశారు. ఐహెచ్ఆర్‌సి కార్యాలయంలో జరిగిన పి.వి.రావు జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాలల హక్కులు, రక్షణ కోసం, వర్గీకరణ రద్దు కోసం తన ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సైతం పట్టించుకోకుండా మాల జాతి కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావుడు పి.వి.రావు అని కొనియాడారు. నేటి మాల జాతి యువత పి.వి.రావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని మాల జాతి మనుగడకు దోపిడి మనువాద కుల పాలకులపైన తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొంత మంది మాల నాయకులు తెలుగు రాష్ట్రాలలో మనువాద పాలకులకు అమ్ముడుపోయి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మారడం జాతికి ద్రోహం చేయడమేనన్నారు.

### చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా సుశీల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** చిక్కడపల్లిలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి గా సుశీల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా నర్మాడా ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనను డెప్యూటేషన్‌పై ఇక్కడికి బదిలీ చేస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు.ఇప్పటి వరకు ఇక్కడ ఈఓగా సేవలందించిన అంబుజ ఈ ఆలయం నుండి రిలీవ్ చేస్తూ కేవలం అమీర్‌పేట్‌లోని కనకదుర్గ దేవాలయానికి పరిమితం చేసారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుశీల్ రెడ్డి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వామివారి సేవలు, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆలయ పవిత్రతను కాపాడుతూ, పారదర్శకమైన పాలన అందిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొని నూతన ఈఓకు స్వాగతం పలికారు.



కాంగ్రెస్ కార్యకర్త నర్సింగ్‌రావుకు ధైర్యం చెబుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

## కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

**చౌటకూరు, మే 10, ప్రభాతవార్త:** కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు ఆపదలో అండగా ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని శివంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మన్నె నర్సింగరావు అనారోగ్యానికి గురికావడంతో కాలుకు శస్త్ర చికిత్స చేసి తొలగించారు. కార్యకర్త నర్సింగ్‌రావుకు కృత్రిమ కాలు అమర్చేలా చొరవ తీసుకోవాలంటూ ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు హైద్రాబాద్‌లోని మంత్రి నివాసానికి చేరకుని వినతి చేయగా కృత్రిమ కాలు ఏర్పాటు అయ్యేలా చూస్తానని మంత్రి భరోసా కల్పించారు. మన్నె నర్సింగ రావు కుమార్తె కళాశాలలో విద్యను అందుకుంటున్నట్లు, ఫీజులో రాయితీ ఇప్పించాలని మంత్రికి వినతి చేయగా రాయితీ సైతం ఇప్పిస్తానని, కార్య కర్తలకు అండగా ఉండటమే తన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్, శివంపేట గ్రామ సర్పంచ్ కొత్తగడి సంధ్యారాణి మల్లికార్జున్‌గౌడ్, నాయకులు జావీద్, శివ ప్రసాద్, చాకలి అశోక్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

## గ్రామ రెవిన్యూ సహాయకులకు వేతనాలివ్వాలి

**పుల్‌కల్, మే 10, ప్రభాతవార్త:** గ్రామ రెవిన్యూ సహాయకులు (వీఆర్ఏ)లకు వేతనాలు చెల్లించి అర్హత గల వారి వారసులకు ఉద్యోగం ఇవ్వాలని గ్రామ పాలన అధికారి అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయికోటి సత్యనారాయణ, బి లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం అధ్యక్ష, కార్యదర్శులు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో 272 మంది గ్రామ రెవిన్యూ సహాయకులుగా గత కొన్నేళ్లుగా రెవిన్యూ శాఖను నమ్ముకుని పని చేస్తున్నారని గుర్తు చేశారు. చాలీచాలనీ గౌరవ వేతనంలో పని చేస్తూ అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు ప్రతి నెల వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి అర్హత గల వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని సత్యనారాయణ, లక్ష్మణ్‌లు కోరారు.

## ప్రత్యేక వాహనాల్లో మోడీ సభకు



అల్లాదుర్గం నుంచి సికింద్రాబాద్‌లో మోడీ సభకు బయలు దేరిన బిజెపి నాయకులు

**అల్లాదుర్గం, మే 10, ప్రభాతవార్త:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోది హాజరయ్యే సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో బిజెపి నాయకులు నరేంద్ర మోదికి అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. మోది సభకు బయలుదేరి వెళ్లిన వారిలో బిజెపి జిల్లా నాయకులు కంచరి బ్రహ్మం, శ్యామయ్య, సిద్దిరాములు, టేక్మాల్ మండల బిజెపి అధ్యక్షులు శంకర్, నాయకులు సతీష్, బద్రీనాథ్, గణపతి తదితరులు ఉన్నారు.



వెల్దుర్తి నుండి విజయవాడకు బయలుదేరిన హనుమాన్ స్వాములు.

## విజయవాడకు తరలిన హనుమాన్ స్వాములు

**వెల్దురి మే 10, ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన వెల్దుర్తిలో హనుమాన్ దీక్షలు చేపట్టిన స్వాములు కఠోర దీక్షతో 41 రోజులు భజనలతో రోజు పూజ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం నాడు స్థానిక విఠలేశ్వరాలయం నుండి హనుమాన్ దేవాలయం వరకు స్వాములు భారీ సంఖ్యలో పాల్గొని హనుమాన్ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములు వాహనంలో విజయవాడకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్వాములు కే గణేష్ స్వామి. కే వెంకటేశం స్వామి. కన్నె స్వాములు తరలి వెళ్లారు.

## విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక శిక్షణ

**నర్సాపూర్ మే 10, ప్రభాతవార్త :**

విద్యార్థులలో సృజనాత్మకత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి నర్సాపూర్ పిఎంసి జడ్పిహెచ్ఎస్ బాయ్స్ నర్సాపూర్ పాఠశాలలో ప్రత్యేక సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సౌమ్యా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈనెల మే 11 నుండి మే 25 వరకు ఉదయము ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు 15 రోజులపాటు సమ్మర్ క్యాంపు కొనసాగుతుందని అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసము పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస తరగతులు, మానసిక ప్రశాంతత కోసం యోగా ధ్యానము, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే క్రీడా కార్యక్రమాలు ఇండోర్ గేమ్స్, క్లాసికల్ డాన్స్, కంప్యూటర్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ చిత్రాలు బొమ్మలు గీయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుమన్నారు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు ఈ మేరకునర్సాపూర్ పట్టణంలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి ప్రధానోపాధ్యాయులు సౌమ్యా నాయక్ అన్నారు.

## నేటి నుంచి సమ్మర్ క్యాంపు

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పాపన్నపేట పి యం శ్రీ ఉన్నత పాఠశాలలో ఈనెల 11 నుండి 25వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ లు వెల్లడించారు.6 నుంచి 9వ తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఈ క్యాంపుకు పాఠశాల పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు భట్టు నాగరాజు ఇన్చార్జిగా వ్యవహరిస్తారని వారు వివరించారు. విద్యార్థులలో దాగిఉన్న ప్రతి భను వెలికితీసేలా సమ్మర్ క్యాంపు లు ఏర్పాటు చేసినట్లు వారన్నారు. మ్యూజిక్, యోగ, ఇండోర్ గేమ్స్, వంటి వాటిల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నైపుణ్యా న్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

## వెల్దుర్తిలో నేటి నుండి 15 రోజుల వరకు సమ్మర్ క్యాంపు

**వెల్దురి మే 10, ప్రభాతవార్త :**మండల కేంద్రమైన వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11 నుండి 26 వరకు 15 రోజులపాటు సమ్మర్ క్యాంప్ నిర్వహించబడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. విద్యార్థుల్లో సృజానాత్మకత. నాయకత్వ లక్షణాలు. క్రమశిక్షణ. వ్యక్తి వికాసాన్ని పెంపొందించడానికి నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు.



గోలబండ తాండ పాఠశాలలో మొక్కలు నాటుతున్న నాయకులు

## చింతకుంట తండాలో గిరిపుత్రుల 'గ్రీన్ చాలెంజ్'

**జిల్లెడు చౌదరిగూడ, మే 8, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడెం మండల పరిధిలోని చింతకుంట తండా గ్రామ పంచాయతీ గోలబండ తాండ ప్రాథమిక పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ చాలెంజ్ మండల కోఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్న నేత మాజీ ఎమ్మెల్యే అని కొనియాడారు. యువకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి ఆయనపై అభిమానం చూపించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, సర్పంచ్‌లు చింతకుంట తండా దేవి రాంచరణ్, ముష్టిపల్లి కన్న జంగయ్య, ఉప సర్పంచ్‌లు కన్న మల్లేష్, ధీమా గణేష్, జె గబ్రు, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ సత్య ప్రమోద్, పడకంటి వెంకటేష్, కోండి యాదయ్య, నర్సింలు, బాసు నరసింహులు, సంజీవ్ రెడ్డి, మోతిల్ నాయక్, శివరాజ్, నీల్యానాయక్, రమేష్, జంగీర్, యువ నాయకులు చెందు, మల్లేష్, కన్న మల్లేష్, సురేష్, దశరథ్ నాయక్, సేవ్యానాయక్, శంకర్ నాయక్, విశాల్, శ్రీను, గోపాల్, నరేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



పూడూరు మండలం మేడిపల్లి కలాన్ శివాలయంలో జరుగుతున్న యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా శివాలయ వార్షికోత్సవాలు

**పూడూరు, మే 10, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని మేడిపల్లి కలాన్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశివాలయ వార్షికోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం మల్లిఖార్జునస్వామి సుప్రభాతసేవ, సామూహిక హోమం, సామూహిక గోపూజ అభిషేకం, మంత్రపుష్పం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలీలు హాజరై రాకమచెర్ల శ్రీ వెంకటదాసులవారి సంకీర్తనలు ఆలాపించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ కమిటీ అద్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కళ్యాణం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

## మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి, మే 10, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన భక్తి జంగమ్మ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈనెల 7న తల కొండపల్లి మండల కేంద్రం సమీపంలో లారీ ఢీకొని భక్తి యాదమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. ఆదివారం నాడు లింగ రావు పల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై యాదమ్మ మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగతంగా 10,000వేల రూపాయలు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ 2000 రూపాయలు, కార్డు సభ్యులు చింతల సురేందర్ రెడ్డి 2000 చొప్పున మొత్తం 14 000వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి జంగయ్య సుమన్ టింకు ప్రమోద్ లోకేష్ రాములు శ్రీను పవన్ కళ్యాణ్ తదితరులున్నారు.



## ఇందిరమ్మ ఇంటికి ప్రారంభోత్సవం

**చేవెళ్ల, మే10, ప్రభాతవార్త :** చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని చేవెళ్ల పట్టణం దామరగిద్ద వార్డ్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్, మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, దామరగిద్ద కౌన్సిలర్ తాళ్లపల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా, కలసి ఆదివారం నాడు ఘనంగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్..... మాట్లాడుతూ,.....అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష ్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, పెద్దోళ్ల దయాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, మాజీ ఉప్ప సర్పంచ్ మాల వెంకటయ్య, నాయకులు, మహేందర్, ల్యాకత్, అంజయ్య, రాజు, యాదగిరి, స్వామి, రాంచందర్, నవీన్, భీమ్ రాజ్, మారుతీ, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## షాద్‌నగర్‌లో మజ్జిగ వితరణ

**షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** ప్రముఖ సామాజికవేత్త నీల రవీందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పరిగి రోడ్, పోచమ్మ గుడి సమీపంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద ఆదివారం భారీ ఎత్తున మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష ్యంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సేవా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎల్కుర్తి నారాయణ (ఫరూక్ నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు) , హన్మారి మురళీధర్ (మాజీ మండల అధ్యక్షులు) , ఆర్యవైశ్య సంఘం నాయకులు చెరుకుపల్లి సురేష్, చెరుకుపల్లి శ్రీనివాస్, గడ్డం ఆంజనేయులు (సాయి ప్రింటర్స్) ప్రముఖ యోగా గురువు గవయ్య పంతులు, నాయకులు గార్లపాటి శ్రీనివాస్, శివ కరుణాకర్, గుండ్ల ప్రకాష్, శ్రీకాంత్, ఉప్పల సత్యం, కట్ట పుల్లయ్య నీల సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.
వాసవి క్లబ్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు గుంత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గజవాడ యశ్వంత్ రాజ్, కోశాధికారి మరియు యోగ గురువు సోమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఈ వితరణ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నీల రవీందర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయన సామాజిక సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

# జన గణనలో కులగణన జరగాలి

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్

**షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** జాతీయస్థాయిలో సమగ్ర కుల జన గణన జరగాలనీ, భారతదేశానికి బీసీ బిడ్డ ప్రధాని అని గొప్పగా చెప్పుకునే నరేంద్ర మోడీ బీసీలకే అన్యాయం చేస్తున్నాడని, గో బ్యాక్ మోడీ అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘాటుగా విమర్శించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం అన్ని మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాహనాలలో రాజధాని హైదరాబాద్ కు కార్యకర్తలు తరలి వెళ్లారు. తెలంగాణ పర్యటనలో భాగంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ వస్తుండడంతో మోడీ గో బ్యాక్ నినాదాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పెద్ద ఎత్తున చేశారు. నల్ల జెండాలు బ్యాడ్జీలతో మోడీ పర్యటనకు నిరసన తెలిపారు. హైదరాబాద్ లో అమరుల స్తూపం వద్ద పెద్ద ఎత్తున ప్రధాని మోడీకి నిరసన తెలియజేయబోతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిర్వహించే జన గణనలో బీసీ కులాల సామాజిక, విద్య మరియు ఆర్థిక స్థాయిలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా భారత ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, దేశవ్యాప్తంగా సమగ్ర కుల జన గణన చేపట్టడానికి అది మార్గదర్శకంగా నిలుస్తుందనీ ఆయన వివరించారు. జన గణనలో సమగ్రంగా కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి. రాజకీయ, సామాజిక ఆర్థిక సమానత్వం కోసం క్రియాశీలక పోరాటాలకు సన్నద్ధం కావాల్సి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కుల గణన చేపట్టి అందుకనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందనీ అదేవిధంగా దేశవ్యాప్తంగా చేపట్టి, కులాల ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలనీ ప్రధానంగా సూచించారు. ఆ ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలనీ, ఆధునిక బానిసత్వం, ఓట్లు, సీట్లు పొందుతున్న రాజకీయ పార్టీలేవీ బీసీల అభివృద్ధి గురించి మాట్లాడవనీ అన్ని రాజకీయ పార్టీలతో జన గణనలో, కుల గణన జరిపించాలని తీర్మానం చేయించి అందుకు కావలసిన కార్యాచరణ తీసుకొచ్చేలా ఆయా రాజకీయ పార్టీల బీసీ నేతలు ఒత్తిడి తీసుకురావాల్సి అని విజ్ఞప్తి చేశారు.
భారతీయ జనతా పార్టీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వకుండా జనగణనలో కులగనన జరగాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన ప్రధాన బాధ్యత వారిపై ఉందని వీర్లపల్లి శంకర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఫరూక్ నగర్, కొత్తూరు, కొందుర్గు, చౌదరిగుడా, కేశంపేట, నందిగామ, షాద్ నగర్ టౌన్ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు విభాగాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యాలయంలో రక్తదానం

**షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** జన హృదయ నేత మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు. అంజన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో షాద్నగర్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, మారుమూల గ్రామీణ ప్రాంతాలను సైతం ఎవరు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత అంజయ్య యాదవ్ కే దక్కుతుందన్నారు. నిరంతరం ప్రజాక్షేమానికి పరితపించే గొప్ప నాయకుడు అంజయ్య యాదవ్ అంటూ కొనియాడారు. రానున్న రోజుల్లో అంజయ్యయాదవ్ నాయకత్వం రావడం ఖాయమని పలువురు నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

**అంజయ్య యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ**

తమ అభిమాన నాయకుడు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు రక్తదానం చేశారు. తమ అభిమాన నాయకుడు నిండు నూరేళ్ల పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షి ంచారు. రక్తదానం చేసిన 105 మందికి ప్రశంస పత్రాలను అందజేశారు.
మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోయింది. జై అంజన్న.. అంజన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో పార్టీ కార్యాలయం దద్దరిల్లింది. తమ అభిమాన నాయకుడిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు కార్యకర్తలు అభిమానులు పోటీపడ్డారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీ ్మ నరసింహ రెడ్డి 516 పుస్తకాలు అందజేశారు.

**అభిమాన నేత కోసం ప్రత్యేక పూజలు**

తమ అభిమాన నేత మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ జన్మదిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫరఖ్ నగర్ మండలం ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయం, జానంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఎలికట్ట అంబ భవాని మాత దేవాలయం, చౌదమ్మ గుట్ట వీరాంజనేయ స్వామి దేవాలయం, తుల్జాపూర్ భవాని మాత దేవాలయంతో పాటు నియోజకవర్గం మండలాలలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ అభిమాన నేత ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్ల పాటు సంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**దౌల్తాబాద్, మే 10, ప్రభాతవార్త:** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. దౌల్తాబాద్ మండలంలోని అంతారం గ్రామంలో ఆదివారం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పొందాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సేరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, నాయకులు

కార్యదర్శి జంగం వీరన్న, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాజశేఖర్ రెడ్డి, గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మధురాపూర్‌లో కొండముచ్చుల బెడద

**షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** తెలంగాణలో కొడెంగ.. ఆంధ్రాలో అయితే కొండముచ్చు.. పేరు ఏదైతేనేం.. ఒక గ్రామాన్ని హడలు కొడుతున్నాయి.. జనాలను అవస్థలకు గురిచేస్తున్నాయి.. ఫరూక్ నగర్ మండలం మధురాపూర్ గ్రామంలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. గ్రామంలో రోజురోజుకు విపరీతమవుతున్న కొండముచ్చుల కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాజాగా ఆదివారం నక్కల అనిత అంజయ్య గౌడ్ పై ఈ కొండముచ్చులు దాడి చేసి గాయపరిచాయి. గ్రామంలో ఇది కొత్త కాదు.. నాలుగు సంవత్సరాల క్రితం ఆమె అత్తమ్మ దన్నారం నక్కల సత్యమ్మ పైన కూడా ఈ కొడెంగలు దాడి చేయడంతో ఆమె చనిపోయింది. ఇక తరచూ ఎవరు కనిపించిన ఈ దాడులు చేస్తూ ఇబ్బంది గురి చేస్తున్నాయి. ట్రాక్టర్ కనిపిస్తే చాలు వాటి మీద ఎక్కి హల్చల్ చేస్తున్నాయి. పంట పొలాలను పాడు చేస్తున్నాయి. తీవ్రమైతున్న ఈ సమస్యపై అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో మాజీ ఎంపిటిసి భార్గవ్ కుమార్ రెడ్డి తల్లిపాయి కూడా ఇవి దాడి చేశాయి.



అస్తమానం గ్రామంలో కొడంగల బాధ వర్ణనాతీతం అయింది స్థానిక పాలకులు వీటిని తరిమెందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సిఎం సభకు 40 బస్సులు

### -జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం నుండి నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి సమావేశం హైదరాబాద్ ఎల్‌బి స్టేడియం నందు నిర్వహించనున్న సీఎం సభకు తరలిరావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి మండలం నుండి రెండు బస్సుల చొప్పున వికారాబాద్ జిల్లా కు మొత్తం 40 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివారం జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు సూచించారు.
ప్రతి మండలం నుండి రెండు బస్సులలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నికల్, విద్యార్థులు, వారి తల్లితండ్రులు, వెళ్ళేవిధంగా మండల విద్యాధికారులు కో ఆర్డినేషన్ చేయాలనీ సూచించారు. ఎ బస్సులో ఎంత మంది వెళ్తున్నారు పూర్తి వివరాలు ఉండాలని, ప్రతి మండల స్కూల్ నందు లంచ్ చేసుకొని, బస్సులు బయల్దేరి, సోమవారం సాయంత్రం 4.30 గంటల వరకు స్టేడియం చేరుకునేలా
సంబంధిత మండల అధికారులు, విద్యాశాఖ సిబ్బంది సమన్వయముతో చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తిరుగు ప్రయాణంలో అందరికి డిన్నర్ ఏర్పాటు చేసి వారి గమ్య స్థానాలకు చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి బస్సులో వాటర్ బాటిల్స్, బిస్కట్స్, ప్రతి బస్సుకు లైసెన్ అధికారి, పోలీస్ అధికారి, ఆశ, ఎఎన్ఎం లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలనీ తెలిపారు. కామాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనీ, ఐడి కార్డ్స్ జారీ చేయాలని, విద్యాదికారికి ఆదేశించారు.
విద్యా వారోత్సవాలు, విద్యా రంగ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

## బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు

**మేడ్చల్, మే 10, ప్రభాతవార్త :** మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సమక్షంలో మేడ్చల్ డివిజన్ పరిధిలోని పలు పార్టీల నాయకులు బిఆర్ఎస్‌లో చేరారు. జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి 50మంది ఇతర పార్టీ కార్యకర్తలు, యువకులు తరలివెళ్లగా ఎమ్మెల్యే మల్లారెడ్డి వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వెంకట్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, భాస్కర్, ప్రవీణ్, మురళి, నవీన్, రామకృష్ణతో పాటు మేడ్చల్ మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, జవహర్ నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి. రాజశేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు



**షాద్‌నగర్, మే 10, ప్రభాతవార్త :** అందరి మంచి కోరే మా అంజన్న ఎప్పుడు చల్లంగా ఉండాలి.. అని కోరుతూ బీఆర్ఎస్ నేత చేగూరు వేణుగోపాల్, మాజీ కోషన్స్ సభ్యులు ఒగ్గు కిషోర్, కౌన్సిలర్లు ఎస్పీ శివ, పి.గోపాల్, యువ కార్యకర్త అభిలాష్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి వెలుగులు తెచ్చిన అంజయ్య యాదవ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, భవిష్యత్తులో మరోసారి నియోజకవర్గాన్ని ఏలాలని కోరుతూ ఈ పూజలు చేసినట్లు ఆయన వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ జన్మదిన పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఒగ్గు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

**తలకొండపల్లి, మే 10, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం నాడు నరసింహస్వామి గుట్టపైన లక్ష్మీ ్మ నరసింహ స్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాలుగోవ వార్షికోత్సవ సంద ర్భంగా జరిగిన ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఆదివారం నాడు స్వామివారికి నిర్వహించిన కళ్యాణోత్సవానికి మాజీ మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆవరణంలో అమ్మ పాదపూజ నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. అమ్మ పాదపూజ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు విద్యార్థులకు ఉప్పల వెంకటేష్ పూలు చల్లి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ అమ్మ పాద పూజ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తల్లిదండ్రులు



అమ్మకు పాద పూజ చేస్తున్న ఉప్పల వెంకటేష్

## నేటి నుండి వేసవి శిక్షణ

**ధారూర్, మే 10, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ధారూర్ పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో సోమవారం నుండి వేసవి శిబిరం ప్రారంభం కానుంది. ఈ నెల 25 వరకు 15 రోజుల పాటు సాగే ఈ శిబిరంలో చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, కుట్టుపని వంటి కళలతో పాటు శాస్త్ర సాంకేతిక ప్రయోగాలు, గణిత పజిల్స్, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో పాల్గొనే 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం అందిస్తారు. కేవలం 100 మందికి మాత్రమే అవకాశం ఉన్నందున, ఆసక్తి గల విద్యార్థులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కోరారు.

## డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు..

**కొడంగల్ రూరల్, మే 10 ప్రభాతవార్త :** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొడంగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను మెరుగుపర్చడం, సంస్థాగత అభివృద్ధి, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ సన్నద్ధత, సామాజిక భాగస్వామ్యం లాంటి సమున్నత లక్ష్యాలతో ఈ నెల 11 నుంచి 17వ తేది వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జనగణన, ఇంటింటి సర్వే: తహసీల్దార్

**మోమిన్‌పేట్, మే 10. ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027వ, సంవత్సరం జనాబా గణన ప్రతీ గ్రామంలో ప్రతి ఇంటింటి సర్వే చేయడానికి నేటినుండి ప్రారంభిస్తున్నట్లు మోమిన్‌పేట్ తహసీల్దార్ రవిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి గ్రామానికి నియమితులైన ఎన్యూమరేటర్ సెన్సెస్ సర్వే అధికారులు నేటినుండి జనాబా గణన పూర్తి చేసే వరకు గ్రామాలలోని ప్రతి ఇంటి యజమాని తన ఇంటి పూర్తి వివరాలు చెప్పి సర్వే అధికారులకు సహకరించాలని తహసీల్దారు కోరారు. ఒక వేళ ఏమైనా సంధేహాలు ఉన్నట్లైతే సంభందిత సర్వే అధికారులను అడిగి తెలుసుకొని పూర్తి వివరాలను, అధికారులు అడిగిన ప్రశ్నలకు పూర్తి వివరాలతో కూడిన సమాచారం తెలిపి ఎన్యూమరేటర్లకు సహకరించాలని తహసీల్దార్ రవిందర్ తెలిపారు.

## ప్రజల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు జిమ్ ఎంతో మేలు

**కంటోన్మెంట్, మే 10 ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. 1వ వార్డు బోయిన్‌పల్లి సౌజన్య కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీల అభివృద్ధికి నిధుల కొరతలేదన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.